పేదల భూమి పెద్దల చేతుల్లో...

- పరాధీనమైన అసైన్డ్ భూములు - 8 శాతం మాత్రమే పేదల స్వాధీనంలో

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పేదల భూమి పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయింది. 2003కు పూర్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములు పరాధీనం అయ్యాయి. 8 శాతం మాత్రమే పేదల చేతుల్లో ఉన్నాయి. మిగిలిన 92 శాతం భూమి ఇతరుల స్వాధీనంలో ఉంది...

పేదలకు 2003కు పూర్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై పూర్తిస్థాయి హక్కు పత్రాలు ఇచ్చేందుకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేసింది. జిల్లాలో మొత్తం అసైన్డ్ భూముల్లో 8 శాతం భూమి మాత్రమే అసైనీలు, వారి వారసుల సాగులో ఉందని, ఆ మేరకు మాత్రమే హక్కుపత్రాలు అందజేయాలని అధికారులు నిర్ధారించారు. పేదలకు పంపిణీ భూమిలో 92 శాతం విస్తీర్ణంలోని భూములు నిబంధనలకు విరుద్ధంగా భూస్వాములు, పెద్దల స్వాధీనంలోకి వెళ్లిపోయినట్లు, వారే అనుభవిస్తున్నట్లు సర్వేలో గుర్తించారు. పారదర్శకంగా ఉంచాల్సిన ఈ భూములకు సంబంధించిన సమాచారాన్ని అధికార యంత్రాంగం గోప్యంగా ఉంచడం పలు సందేహాలకు తావిస్తోంది. అసైన్డ్ భూములపై తాజా ఆర్డినెన్స్ తీసుకొచ్చే క్రమంలో ఏయే గ్రామంలో ఎంత అసైన్డ్ భూమి ఉంది..? ఎవరి పేరుతో పట్టా ఉంది..? ఎవరి స్వాధీనంలో ఆ భూమి ఉంది..? అనే వివరాలను గ్రామ సచివాలయాలు, పంచాయతీల నోటీసు బోర్డుల్లో ఉంచుతామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. క్షేత్రస్థాయిలో ఇది ఆచరణకు నోచుకోవడం లేదు. నోటీసు బోర్డుల్లో ఎక్కడా అసైన్డ్ భూముల వివరాలు, లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించలేదు. పెద్దల స్వాధీనంలోని అసైన్డ్ భూములు వివరాలు బహిర్గతం కాకుండా ఉండేందుకే పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

సి.బెళగల్ మండలంలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

20 ఏళ్ల క్రితమే అసైన్డ్ భూములకు బి-ఫారం పట్టాలు పొందిన వాస్తవ లబ్ధిదారులు, వారసుల స్వాధీనంలోని అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం 9/23 ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో పంపిణీ అయిన భూములు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో నిర్ధారించేందుకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేసింది. కర్నూలు జిల్లాలో పంపిణీ చేసిన 18 వేల ఎకరాల అసైన్డ్ భూమిలో కేవలం 1450 ఎకరాలు మాత్రమే వాస్తవ లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్నట్లు తేల్చారు. మిగిలిన భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ భూముల్లో గృహ సముదాయాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. దున్నేవారికే భూమి నినాదంతో గతంలో పెద్ద ఎత్తున జరిగిన భూ పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వాలు భూములను పేదలకు పంపిణీ చేశాయి. దళితులు, గిరిజనులు, ఇతర పేదలు బి-ఫారం పట్టాలు పొందారు. భూమి లభ్యతను ఆసరా చేసుకుని జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా 20 సెంట్ల నుంచి 2.5 ఎకరాల వరకూ లబ్ధిదారులకు పంపిణీ జరిగింది. ఈ భూములు పొందిన లబ్ధిదారుల కుటుంబాలు సేద్యం చేసి ఫలసాయం పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో ఈ భూముల క్రయ విక్రయాలను ప్రభుత్వం నిషేధించింది. అసైన్డ్ భూములను లబ్ధిదారులు అమ్మడం, లబ్ధిదారుల నుంచి కొనడం నేరమని పేర్కొంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరిగితే ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ (పిఒటి) చట్టం కింద రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలి. పాలకులు ఈ చట్టం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పేదల పేరున పట్టాలు ఉన్నా అసైన్డ్ భూముల్లో అత్యధిక శాతం అనధికారికంగా పెద్దల స్వాధీనంలోకి వెళ్లిపోయాయి.

పెద్దలకు కట్టబెట్టేందుకే

పేదల భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ప్రభుత్వం అసైన్డ్ భూములకు సంబంధించి ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దొడ్డి దారిన గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ తీసుకురావడం దుర్మార్గం. సిసిఎల్ఎ గైడ్‌లైన్స్ ప్రకారం సచివాలయాల్లో అసైన్డ్ భూముల సమాచారాన్ని నోటీసు బోర్డులో ఉంచాలి. ఎక్కడా అది జరగలేదు. అడ్డగోలుగా ఆన్‌లైన్‌లోకి ఎక్కించేశారు. ఈ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి. ఇప్పటికే తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించాం. ఆందోళనలు తీవ్రం చేస్తాం.

- కెవి.నారాయణ, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి.

ముఖ్యమంత్రి సభకు

భారీగా జన సమీకరణ

- పొదుపు మహిళల తరలింపు

- ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 'జగనన్న చేదోడు'కు శ్రీకారం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మరో కొద్ది నెలల్లోనే ఎన్నికలు సమీపిస్తుండగా ముఖ్యమంత్రి పర్యటనకు పెద్దఎత్తున ఏర్పాట్లను చేస్తున్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి నిర్వహించే బహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేపట్టాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు అందడంతో దృష్టి సారించారు. ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరుకు రానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించేందుకు పోలీసు యంత్రాంగం పర్యవేక్షిస్తోంది.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'జగనన్న చెగోడు' 4వ విడత ఆర్థిక సహాయానికి సంబంధించిన నిధులను ఎమ్మిగనూరు నుంచి విడుదల చేయనున్నారు. ఎమ్మినూరు వీవర్స్ ఆపరేటివ్ సొసైటీ మైదానంలో ముఖ్యమంత్రి బహిరంగ సభ వేదికను సిద్ధం చేశారు. బహిరంగ సభకు జన సమీకరణ ఎక్కువ సంఖ్యలో ఉండాలని సిఎంఒ కార్యాలయం నుంచి అధికార యంత్రాంగానికి ఆదేశాలందాయి. ఇందులో భాగంగా సిఎం బహిరంగ సభకు పొదుపు మహిళలను తరలించేందుకు డిఆర్‌డిఎ, మెప్మా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు పంపారు. పొదుపు మహిళలను బహిరంగ సభకు వేదికకు తీసుకొచ్చే బాధ్యతను ఈ రెండు శాఖలకు చెందిన కిందిస్థాయి ఉద్యోగులు చూసుకునేలా చర్యలు చేపట్టారు. అవసరమైతే ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేయడం, ప్రత్యేక వాహనాలనూ సిద్ధం చేస్తున్నారు. బహిరంగ సభకొచ్చే సామాన్యులకు కూడా మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు అధికార యంత్రాంగమే చర్యలు తీసుకుంటుంది. సభ పూర్తయ్యేంత వరకు ఎక్కడా ఖాళీ కుర్చీలు కనపడకుండా పూర్తి స్థాయిలో సమీకరణ చేపట్టాలని అటు కలెక్టర్‌కు ఇటీవల ఇన్‌ఛార్జీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమయ్యేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు జిల్లా ప్రజాప్రతినిధులకు ఆదేశాలిచ్చారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి సభలు విజయవంతం చేసేలా అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు కుస్తీ పడుతున్నారు.

నిధుల్లేక అల్లాడుతున్న అధికారులు

ముఖ్యమంత్రి పర్యటనల పట్ల అధికారులు ఇబ్బందులకు గురవుతుంటారు. ముఖ్యమంత్రి సభకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు అవుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఇబ్బందులు పడుతోంది. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రత్యేకంగా ఎలాంటి ప్రొటోకాల్ కింద నిధులు రాకపోవడంతో అప్పులు చేసి పర్యటన ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొటోకాల్‌కు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నెలకు రెండుసార్లు ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

3.30 గంటల పాటు జిల్లాలో ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం 3.30 గంటల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఉదయం 9.45 గంటలకు ఓర్వకల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా హెలిక్యాప్టర్ ద్వారా ఎమ్మిగనూరుకు బయల్దేరి వెళ్తారు. 10.15 గంటలకు ఎమ్మిగనూరుకు చేరుకుని, అక్కడ ప్రజాప్రతినిధులతో కొంతసేపు ముచ్చటిస్తారు. అనంతరం నేరుగా ఎమ్మిగనూరు వీవర్స్ సొసైటీ మైదానానికి చేరుకుంటారు. అక్కడే జగనన్న చేదోడు నాలుగో విడత ఆర్థిక సహాయం నిధుల విడుదలకు శ్రీకారం చుడతారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.25 గంటలకు ఓర్వకల్ విమానాశ్రయం నుంచి విజయవాడకు బయల్దేరి వెళ్తారు.

ముఖ్యమంత్రి పర్యటనకు భద్రత పటిష్టం

- కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరు పర్యటనలో పటిష్టమైన భద్రత కల్పించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశించారు. ఈనెల 19న ఎమ్మిగనూరుకు ముఖ్యమంత్రి రానున్న సందర్భంగా కలెక్టర్, ఎస్పీ కలిసి మంగళవారం ఎఎస్ఎల్ (అడ్వాన్స్ భద్రత లీసన్) నిర్వహించారు. తొలుత హెలిప్యాడ్, అనంతరం బహిరంగ సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన భద్రత చర్యలపై కలెక్టర్, ఎస్పీ చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఎస్పీ పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం బహిరంగ సభ వేదిక ఏర్పాట్లపై కలెక్టర్ ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్‌తో చర్చించారు. వేదికపై ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో ఉన్న కంపార్ట్‌మెంట్లలో విఐపిలకు, పాత్రికేయులకు, మిగతా కంపార్ట్‌మెంట్లను జగనన్న చేదోడు లబ్ధిదారులకు, ప్రజలు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సభా ప్రాంగణానికి వచ్చే వారికి ఎండ తీవ్రత దృష్ట్యా తాగు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాంగణమంతా శుభ్రంగా ఉండే విధంగా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, ఫైర్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్ఇడి స్క్రీన్స్, పటిష్టమైన బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఇ నాగరాజు, డీఎస్పీ సీతారామయ్య, వైసిపి నేత ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

సలీమ్ శంకర్ చెరలోని భూమికి విముక్తి కల్పించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డిలో సలీమ్ శంకర్ ఆక్రమించిన భూములకు విముక్తి కల్పించాలని, పేదలకు పంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోడుమూరు మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా, సి బెళగల్ మండల కార్యదర్శి జె.మోహన్‌ల సమక్షంలో ఆ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 2, 666 లో 2900 ఎకరాలు, 538 నుండి 558 వరకు 600 ఎకరాలు మొత్తానికి 3 వేలకు పైగా అసైన్డ్ భూములు ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని ఈ భూబకాసురుడికి నేతల అండదండలు, అధికారుల అసమర్థత, నిరంకుశత్వంలో భూ పరిపాలన యంత్రాంగం ఉన్నందువలనే సాధ్యమైందని తెలిపారు. టెలిఫోన్ ఆపరేటర్ గా గూడూరుకు వచ్చి ఇక్కడే నిరుపేదలను ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని అప్పులిచ్చి, ఆపై సకాలంలో చెల్లించని వారి భూములు అక్రమించుకొని, మరీ కొందరివి అన్యాయంగా కొనుగోలు చేసి, అక్కడే బంజరు భూములను ఆక్రమించి ఈదురుసాబ్, విజయులు రెడ్డి, గణేష్, జిలాని, సుకూర్‌మియా, సలీమ్ ఇలా బినామీలుగా మార్చుకొన్నారన్నారు. వామపక్షాలు పోరాట ఫలితంగా చనుగొండ్ల, పులకుర్తి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, కళ్ళపరి, బైతోలి, కానాపురం గూడూరు, బెళగల్, బురాన్ దొడ్డి, మెరుగు దొడ్డి,గ్రామాలలో భూములు లేని 300 మంది కుటుంబాలకు ఇక్కడే పట్టాలిస్తామని 2012 లో అప్పటి కలెక్టర్ కన్నబాబు హామీఇచ్చినా అమలుకు నోచలేదన్నారు. ఫలితంగా ఆ భూముల్లో సాగులు చేసుకుంటున్న భూములను సలీమ్ శంకర్ దున్నేస్తుండటం వలన భూమిలేని ప్రజలు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఇంతటితో ఆగకుండా మైనింగ్ యంత్రాంగం నిద్రావస్థకు ఈ మధ్య గ్రీన్ కంపెనీలకు ఎర్రమట్టిని, గర్సును భారీగా అమ్ముకొని కోట్లలో సొమ్ములు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా యంత్రాంగం మేలుకొని జిల్లాలో ఆయా ప్రాంతాలలో అన్యాక్రాంతమైన 80 వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేయాలని, లేదంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు టి.వీరన్న, మనోహర్, పి.వీరన్న పాల్గొన్నారు.

భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

టిడిపి శాంతి ర్యాలీ విజయవంతం

- సిపిఐ, జనసేన సంఘీభావం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా మంగళ వారం కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బిటి.నాయుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో సంఘీభావ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు జగన్నాథం, జనసేన నాయకులు చింత సురేష్ బాబు పార్టీ శ్రేణులతో ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల పార్టీ ఇంచార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు భూమా అఖిల ప్రియ, బుడ్డా రాజశేఖర రెడ్డి, గౌరు వెంకట రెడ్డి, టిజి.భరత్, గౌరు చరితా రెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి, బిసి.జనార్ధన్ రెడ్డి, మన్నె సుబ్బారెడ్డి, కెఇ.శ్యాం బాబు, ఆకేపోగు ప్రభాకర్, బివి.జయనాగేశ్వర రెడ్డి, పి.తిక్కారెడ్డి, కె.మీనాక్షి నాయుడు, వై.నాగేశ్వరరావు యాదవ్, నాగేంద్ర, పోతురాజు రవికుమార్, సోమిశెట్టి నవీన్, కె.బషర్ అహ్మద్, కురువ పరమేశ్, రాజు యాదవ్, మహేశ్ గౌడ్, రమాకాంత్ రెడ్డి, సంజీవ లక్ష్మి, బాబు రాజ్, అయ్యన్న పాల్గొన్నారు.

ప్రపంచ ట్రామాడే పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు , ట్రాఫిక్ డిఎస్పి

'జెమ్‌కేర్ కామినేని' ప్రపంచ ట్రామా దినోత్సవం

ట్రాఫిక్ డిఎస్‌పికి సన్మానం

ప్రజాశక్తి-కకర్నూలు హాస్పిటల్ : వరల్డ్ ట్రామా డే సందర్భంగా ఎపిట్రాఫిక్ పోలీస్ అసోసియేషన్‌తో రాజ్ విహార్ సర్కిల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా ఎపి ట్రాఫిక్ పోలీస్ అందిస్తున్న సేవలు , ట్రామా మేనేజ్‌మెంట్‌లో వాళ్ళు చేస్తున్న విశిష్టత గురించి వివరించారు. జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ మానేజ్‌మెంట్, డాక్టర్లు ట్రాఫిక్ డిఎస్‌పి నాగభూషణంను సన్మానించారు. డిఎస్‌పి మాట్లాడుతూ ట్రామా డే విశిష్టతను వివరించారు.హాస్పిటల్ చేస్తున్న సేవల గురించి కొనియాడారు. జెమ్ కేర్ కామినేని హాస్పిటల్స్ ఎమర్జెన్సీ హెచ్‌ఒడి డాక్టర్ రామ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ట్రామా మేనేజ్‌మెంట్ ప్రాముఖ్యత , విశిష్టత ప్రజలు ఎక్కడ్కైనా ఎవరికైనా సడన్ ప్రమాదం జరిగితే, ప్రజలు ఆ సందర్భంలో గాయాల నివారణ, ప్రాణాలు కాపాడుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆర్థోపెడిషియన్ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి 9 సెకన్లకు ఒక ట్రామా జరుగుతోందన్నారు. ఇందులో ప్రజలు ఎలా జాగ్రతలు తీసుకోవాలనేది వివరించారు. జెమ్‌కేర్ కామినేటి ఎండి డాక్టర్ చంద్రశేఖర్, సిఇఒ జనరల్ సర్జన్ డాక్టర్ బాలమురళి కృష్ణ , సిఒఒ డాక్టర్ గణేశ్, మార్కెటింగ్ హెడ్ రమణ బాబు, ఆపరేషన్ హెడ్ నధీమ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. హాస్పిటల్ వారు అతీనా స్కూలులో 200 పైగా విద్యార్థులకు సిపిఆర్ గురించి శిక్షణ ఇచ్చారు. హాస్పిటల్‌లో 300 పై గా నర్సింగ్ స్టూడెంట్స్‌కు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్స్ ఇచ్చారు. ట్రామా టీంలో పని చేసే సిబ్బందిని, డాక్టర్లను సన్మానించారు.

శౌర్యహోండా మెగా ఎక్చేంజ్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు

కలెక్టరేట్ : సిల్వర్ జూబ్లీ కాలేజ్ ఎదురుగా గల జడ్‌పి హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దసరా స్పెషల్‌మెగా ఎక్ఛేంజి మేళాను మేయర్ బివై.రామయ్య, 17వ వార్డు కార్పోరేటర్ కె.పద్మలతారెడ్డి ప్రారంభించారు. అధునీకరించిన హార్నెట్ వెహికిల్‌ను కర్నూలు నగరానికి సాఫ్ట్‌లాంచ్ ద్వారా పరిచయం చేశారు. హోండా చాలా విలువ గల బ్రాండ్అని, శౌర్య హోండా సిబ్బందిని బివై.రామయ్య ప్రశంసించారు. తనకు హోండా స్కూటర్లపై ఉన్న మక్కువను పద్మలత తెలిపారు. శౌర్య హోండా ఎండి విశ్వమోహన్ రెడ్డి మాట్లాడతూ పండగ సందర్భంగా వదులుకోలేని పలు ఆఫర్లను ద్విచక్ర వాహనాల కొనుగోలుపై వినియోగదారులకు అందిస్తున్నామని, ఈ ఎక్ఛేంజీ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ వడ్డీ వ్యాపారులపై చర్య తీసుకోండి

బాధితులతో ఎస్‌సి కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎలాంటి లైసెన్సులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ దళితుల మానప్రాణాలతో ఆడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, జిల్లా నాయకులు టి. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలుకు వచ్చిన ఎస్‌సి కమిషన్ చైర్మన్‌ను బాధితులతో వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూఉమ్మడి జిల్లా పరిధిలోనే ఈ అక్రమ వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. గతంలో ఈ అక్రమ వడ్డీ వ్యాపారాల పైన కాల్‌మనీ పేరుతో కొరడా జులుపించిన ఆ సంవత్సరం వరకు తగ్గుముఖం పట్టాయన్నారు. ఇటీవల నాలుగేళ్ల నుండి అక్రమ దందా పెరిగిపోయిందన్నారు. పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని, చిన్న మొత్తాలకు అధిక వడ్డీ లేస్తూ.. ఖాళీ బాండ్లలో సంతకాలు చేయించుకుంటూ.. పేదలను మోసం చేస్తున్నారన్నారు. కర్నూలు నగరంలోని రామేశ్వర్ నగర్ లో నివాసం ఉన్న అనసూయమ్మ, షరీన్ నగర్‌లో నివాసం ఉండే దళితురాలైన రోజువారి కూలీ అనితకు రూ.20వేలకు డైలీ కట్టే విధంగా అప్పు ఇచ్చి, రూ.పదివేలు కట్టాక జ్వరం వచ్చి ఊరికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తే, మనుషులతో భర్తలేని సమయంలో ఇంటిపై పడి బీభత్సం సృష్టించి రూ.2 లక్షలు అప్పు ఇచ్చినట్లుగా సంతకం పెట్టించుకున్నారన్నారు. భర్తకు తెలియకుండా ఇంత మొత్తం ఎలా ఇచ్చారని అడిగిన భర్త సంగటి సోమన్నను కులం పేరుతో దూషించి, డబ్బులు కట్టు లేదా నీ భార్యను తాకట్టు పెట్టు అంటూ నీచంగా మాట్లాడుతున్నారన్నారు. కర్నూలు నగరంలోని బి క్యాంప్‌లో నివాసం ఉన్న మరో ఆక్రమ వడ్డీ వ్యాపారులు మాధవి, నిర్మలలు తాము కూడా అనితకు డైలీ కు రూ.30,000 ఇచ్చామని, తమకు కూడా రూ.20 వడ్డీ లాగా మూడు లక్షలు చొప్పున చెల్లించాలని ఇబ్బంది పెడుతున్నారన్నారు. తీసుకున్న అప్పు చెల్లించినా.. అధిక మొత్తంలో వడ్డీ చెబుతూ దళితుల మానప్రాణాలతో ఆడుకుంటున్న వారిపై తమరైనా ప్రత్యేకంగా చొరవ తీసుకొని చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరారు. ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ , ఎస్పీలకు సమస్యను తెలియజేసి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో బాధితుడు సంగటి సోమన్న, రాజ్ కుమార్ ఉన్నారు.

ప్రజలందరూ సమైక్య భావనతో మెలగాలి : ఎంపి

కర్నూలు స్పోర్ట్స్: యువజన సర్వీసులు సెట్కూరు, విద్యా శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక అవుట్ డోర్ స్టేడియం నుంచి ఇండోర్ స్టేడియం వరకు కర్నూలు జిల్లా మేర మీట్టి మేర దేశ్ - అమృత్ కలశ యాత్రను కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ ,కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య పాల్గొన్నారు. ఎంపి సంజీవ్ కుమార్ , బివై.రామయ్య మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో సంబరాల కార్యక్రమంలో భాగంగా 'మేరీ మట్టి మేరా దేశ్ - అమృత్ కలశ యాత్ర' కార్యక్రమం భారతదేశంలో ప్రతి వ్యక్తిని, కుటుంబాన్ని , పౌరుడిని సామాజికంగా దగ్గర చేయడం లక్ష్యంగా ఏర్పాటు చేసినదని అన్నారు. సెప్టెంబర్ 1 నుండి, భారతదేశం అంతటా, వార్డులు , గ్రామాల నుంచి 7500 కుండలలో మట్టి లేదా ధాన్యాలను సేకరించడంతో ప్రారంభించి అక్టోబర్ 28 నుండి 30 వరకు ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా లోని వివిధ గ్రామాలూ , మండలాల నుంచి సేకరించిన మట్టి , ధాన్యాలను కర్నూలు జిల్లాలోని 7 బ్లాకులు - నియోజకవర్గాల వారీగా అమృత కళశాలలో నింపి రాష్ట్ర స్థాయిలో అక్టోబర్ 22-24 వరకు నిర్వహించే కార్యక్రమానికి నెహ్రూ యువకేంద్ర ద్వారా ఎంపిక చేసిన వాలంటీర్ల ద్వారా పంపే కార్యక్రమం చేస్తారని తెలిపారు. డిఇఒ రంగా రెడ్డి, సిఇఒ పివి.రమణ , ఎన్‌సిసి అధికారి రఘురామ్, డిప్యూటి డైరెక్టర్ చంద్ర శేఖర్ , జిల్లా నెహ్రూయువ కేంద్రం సమన్వయ కర్త రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బస్సు యాత్రకు సన్నాహక సభ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరంలోని దేవానగర్‌లోని ఎంఎస్ 9 గెస్ట్‌ఇన్ లోని వైసిపి ఎస్‌సి సెల్ రాయలసీమ జిల్లాల ముఖ్య నాయకుల ప్రాంతీయ సదస్సు సామాజిక న్యాయ బస్సు యాత్ర - సన్నాహక సమావేశం సదస్సు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అడ్వైజర్ జూపూడి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు ముఖ్య అతిధులుగా కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్ ,బాపట్ల ఎంపి నందిగంసురేష్ ,ఎమ్మెల్సీ రామ్ సుబ్బారెడ్డి, ప్రభుత్వ అడ్వైజర్ జూపూడి ప్రభాకర్ రావు, జిల్లా ఎమ్మెల్యేలు కర్నూల్, పాణ్యం, కోడుమూరు, ఎమ్మెల్యేలు హాఫిజ్ ఖాన్ , కాటసాని రాంభూపాల్ రెడ్డి , డాక్టర్ సుధాకర్, మేయర్ బివై రామయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు

ప్రభుత్వ సలహాదారు ఎంపీలకు ఎమ్మెల్యే ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్‌ను కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్‌ఖాన్ మంగళవారం ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారిని తన స్వగృహంలో శాలువా టోపీలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నందిగామ సురేష్‌ను డివిఎంసి సభ్యులు ప్రభుదాసు మర్యాదపూర్వకంగా కలిశారు.

రాజవర్ధన్‌రెడ్డి స్మారక చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఏ.గఫూర్

రాజవర్ధన్ రెడ్డి స్మారక చెస్ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్ : కర్నూలు సిస్టర్స్ స్టాన్‌ల్సన్ స్కూల్ లో మంగళవారం రాజవర్ధన్ రెడ్డి స్మారక జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభకార్యక్రమనికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే , సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ.గపుర్ హాజరయ్యారు. విష్ణువర్ధన్ రెడ్డి , వహిద్ హుస్సేన్, మహీంద్రా పాల్గొన్నారు. అతిధులు రాజవర్ధన్ రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కీర్తిశేషులు రాజా వర్ధన్ రెడ్డి ఎంపి పిగా ప్రజల మన్ననలు పొందరన్నారు. విద్యలో మంచి ప్రవీణ్యం పొందారని గఫుర్ కొనియాడారు. ఆయన స్మారక పోటీలు నిర్విహించడం ఆనందదాయక మని అన్నారు. ఈ చదరంగం వలన మేధోశక్తి పొంపొంచు కొనేందుకు ఉపకరిస్తుందని అన్నారు. అనంతరం చెస్ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం కార్యదర్శి గోవిందా జీయర్, ఇమ్రాన్ హుస్సేన్ , రామసుబ్బారెడ్డి , రవి నాయక్, కిశోర్, స్వాతి, బద్రి పాల్గొన్నారు.

రాజన్న సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పండ్లు పంపిణీ చేస్తున్న దస్తగిరి

కర్నూలు మాజీ ఎంపీపీ రాజా విష్ణువర్ధన్ రెడ్డి సేవలు మరువలేనివని కోడుమూరు నియోజకవర్గ టిడిపి యువ నాయకులు దస్తగిరి అన్నారు మంగళవారం రాజ విష్ణువర్ధన్ రెడ్డి 45వ జయంతి వేడుకలను పురస్కరించుకొని కర్నూలు నగరంలోని సరస్వతి విజ్ఞాన కేంద్రం చిన్మయ నిరాశ్రయుల కేంద్రం లో బాలలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దినేదేవరపాడు సర్పంచ్ మాధవస్వామి పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో చీరల పంపిణీ

గూడూరు : గూడూరు గ్రామంలో కీర్తిశేషులు డి రాజ వర్ధన్ రెడ్డి జయంతిని విష్ణువర్ధన్ రెడ్డి అభిమానులు నాగలాపురం సర్పంచి నయోమిని భర్త సురేష్ ఆధ్వరంలో స్థానిక మున్సిపల్ కార్మికులకు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాగలాపురం సర్పంచి భర్త సురేష్ గూడూరు మున్సిపల్ మాజీ చైర్మన్ కె రామాంజనేయులు కర్నూల్ మండల మాజీ కన్వీనర్ వెంకటేశ్వర్లు కౌన్సిలర్లు మల్లాపూర్ డెంగ్రి,కోడుమూరు శేషావలి మాజీ జడ్‌పిటిసి కృష్ణ మాట్లాడారుం

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి

స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని చెప్పారు. మంగళవారం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో సచివాలయ నూతన భవన ప్రారంభోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి ముక్కరన్న, వైసిపి నాయకులు, మాజీ ఎంపిటిసి రఘునాథ్ రెడ్డి, వైసిపి నాయకులు మంగళ వాయిద్యాలతో పూలమాలలు వేసి స్వాగతం పలికారు. శిలాఫలకాన్ని ప్రారంభించి రిబ్బన్ కట్ చేసి సచివాలయాన్ని ప్రారంభించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో పాల్గొని గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామానికి ఆదోని, మాధవరం ప్రధాన రహదారి నుంచి రూ.50 లక్షలతో తారు రోడ్డు, రూ.20 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాలు, రూ.65 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీ, రూ.55 లక్షలతో తాగునీటి సౌకర్యం, రూ.5 లక్షలతో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేశామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టిడిపి నాయకులు మాటలు చెప్పి ఓట్లు వేయించుకోవడానికి వస్తారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. పేదల విద్యకు పెద్ద పీట వేయడమే కాకుండా కార్పొరేట్ తరహాలో విద్య, వైద్యం అందించడం జగనన్నకే సాధ్యమైందని కొనియాడారు. పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఎమ్మెల్యే, సీతారామిరెడ్డికి గజమాలతో సన్మానం చేశారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, యువ నాయకులు దశరథ రెడ్డి, ఎస్ఐ కిరణ్, ఎంపిడిఓ మణిమంజరి, ఇఓఆర్‌డి ప్రభావతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఎపిఓ తిమ్మారెడ్డి, ఎపిఎం జయశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేద స్వరూప, పిఆర్ డిఇ అశ్వత్థామ, జెఇ నరసింహులు, ఎంపిటిసి విశాలక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ ఆయకట్టుకు నీరు..
ఆయకట్టుకు కన్నీరు..!

- ఎకరాకు రూ.2 వేల వరకు వసూలు - ఉన్నతాధికారులు స్పందించాలని రైతుల విన్నపం

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని అక్రమ ఆయకట్టు కళకళలాడుతోంది. ఆయకట్టు కింద మాత్రం పంటలు ఎండిపోయి రైతులు విలవిల్లాడుతున్నారు. అక్రమ ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. ఆయకట్టు రైతులకు సాగునీరు అందకపోవడంతో కన్నీరు పెడుతున్నారు. కౌతాళం మండలంలోని తుంగభద్ర దిగువ కాలువ కింద టిఎస్, 74, 75, కౌతాళం మేజర్, మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్ల కింద పత్తి, మిరప, వరి పంటలు సాగు చేశారు. ఈ డిస్ట్రిబ్యూటర్ల కింద ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించాల్సిన ఉంది. మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్ కింద ఉరుకుంద, చిరుతపల్లి, మల్లనహట్టి, చూడి, బంటకుంట, సులేకేరి, మధిరే, పొదలకుంట, హాల్వి, గోతులదొడ్డి, కుంభాలనూర్, అగసలదిన్నె, కాత్రికి గ్రామాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ కాలువల పరిధిలో అక్రమ ఆయకట్టు గణనీయంగా సాగవుతోంది. సాగునీరు మాత్రం అక్రమ ఆయకట్టుదారులు పొలాలకు మళ్లిస్తున్నారు. కింద ఉన్న ఆయకట్టుకు మాత్రం సాగునీరందక పంటలు ఎండిపోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ఆయకట్టు కాలువల పరిధిలో పగలు, రాత్రి తేడా లేకుండా ఆయిల్ ఇంజిన్లతో, ట్రాక్టర్లతో సాగునీటిని అక్రమ ఆయకట్టుకు మళ్లిస్తున్నారు. ప్రతి కాలువపైనా ఈ ఇంజిన్ల సౌండ్ వినపడుతున్నా తుంగభద్ర దిగువ కాలువ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో అక్రమంగా నీటిని మళ్లిస్తే పోలీసు స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేసేవారు. ఇలా కాకుండా మామూళ్ల మత్తులో సంబంధిత అధికారులు ఉండడంతో అక్రమ ఆయకట్టుదారులకు భయం లేకుండా పోయింది. విచ్చలవిడిగా అక్రమ ఆయకట్టుకు సాగునీరు ఉపయోగిస్తుండడంతో కింద ఉన్న ఆయకట్టు పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు, కనీసం సాగునీరు కూడా అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర నష్టపోతామని రైతులు ఇటీవల తుంగభద్ర దిగువ కాలువ డిఇ మహ్మద్ సైపుల్లా దృష్టికి తీసుకొచ్చారు.

ఎకరాకు రూ.1000 నుంచి రూ.2 వేల వరకు వసూలు

వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సాగునీటికి డిమాండ్ పెరిగింది. ఎల్ఎల్‌సి కింద సాగు చేసిన పంటలకు నీటి కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇదే అదునుగా భావించి రైతుల నుంచి ఎకరాకు రూ.1000 నుంచి రూ.2 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారు. రైతులు అధికారులకు డబ్బులు చెల్లించి ఇంజిన్లు. ట్రాక్టర్లు పెట్టి నీటిని అక్రమంగా వాడుకుంటున్నారు. ముఖ్యంగా హాల్వి సెక్షన్లలో ఎక్కువగా జరుగుతుండడంతో ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతోంది. గత వారంలో ఎల్ఎల్‌సి డిఇ ముందే ఒక రైతు ఎకరాకు రూ.2 వేలు వసూలు చేస్తున్నారని పేర్కొనడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఆయకట్టును అరికట్టి, ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హాల్వి సెక్షన్‌లో అక్రమంగా సాగునీటిని మళ్లిస్తున్న రైతులు

వీవర్స్ కాలని మున్సిపల్ మైదానంలో బంకులు తొలగించరా..?

- టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్టణానికి రానున్న సందర్భంగా బైపాస్ రోడ్డులో ఉన్న రేకుల షెడ్డును యజమానులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మున్సిపాలిటీ అధికారులు తొలగించారని టిడిపి కౌన్సిలర్లు దయాసాగర్, రాందాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభ జరుగుతున్న ప్రదేశం పక్కనే అక్రమంగా మున్సిపాలిటీ స్థలంలో వేసిన బంకులు అధికారులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై కొంతకాలంగా తాము అధికారులను కౌన్సిల్‌లో ప్రశ్నిస్తుంటే బంకులను తొలగిస్తామని చెబుతున్నారే తప్ప తొలగించలేదన్నారు. ఇప్పుడు ఎక్కడో ఉన్న బైపాస్ రోడ్డులో బంకులను తొలగించారని, పక్కనే ఉన్న మున్సిపల్ బంకులను వదిలేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ బంకులకు సొసైటీ వారు ప్రాపర్టీ టాక్స్ కూడా అడుగుతున్నారని తెలిసినా అధికారులు ఎందుకు బంకులు తొలగించడం లేదన్నారు. ఇలాగే వదిలేస్తే రాబోయే రోజుల్లో పట్టణంలో క్రీడాకారులకు, ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారికి ఉపయోగపడే ఏకైక మైదానం కూడా కబ్జాకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. మున్సిపల్ బంకులను తొలగించాలని డిమాండ్ చేశారు.

19 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 19 నుంచి యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగే నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప కోరారు. మంగళవారం యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కేంద్రం ఇచ్చిన మెమో 57ను అమలు చేసి 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగులందరికీ ఒపిఎస్‌ను అమలు చేయాలని తెలిపారు. 19న ఉదయం 10 గంటల నుంచి కృష్ణదేవరాయలు ధర్నా చౌక్ దగ్గర, 20 నుంచి తాలూకా కేంద్రాలైన ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండలో నిరవధిక నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లారి నాగరాజు, ఆడిట్ కమిటీ సభ్యులు కౌలన్న, లక్ష్మన్న, చంద్రపాల్, పెద్దారెడ్డి, బి.రామాంజనేయులు, ఎం.నాగరాజు, రాందాస్, హనీఫ్, శ్రీనివాసులు, వై.రామాంజనేయులు, శాంతన్న పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

- కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేంద్ర నాయుడు

ప్రజాశక్తి - దేవనకొండ

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేందర్ నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దేవనకొండ, కరివేముల, తెర్నేకల్లు గ్రామాల్లో కాంగ్రెస్ పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో కలిసి సమస్యలను తెలుసుకున్నారు. మండలం మధ్యలో ఉండే గ్రామాల్లో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. రెండో రోజు పల్లె పాదయాత్ర కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు మహేంద్ర నాయుడు రైతుల పొలాల దగ్గరికి నేరుగా వెళ్లి రైతు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గం వేసిన ఓట్లతో ఎమ్మెల్యే, మంత్రి పదవి చేపట్టినా బీసీల సమస్యలు పట్టించుకున్న పాపానా పోలేదన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి లేదని, ఉల్లి రైతుల సమస్యలు కూడా అలాగే ఉన్నాయని తెలిపారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని కోరారు. శ్రీను, పరమేష్, ధను, రామయ్య, బాబు, రవి పాల్గొన్నారు.

గడపగడపకు ఆరోగ్య సేవలు

ఆదోనిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

చిప్పగిరిలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న నారాయణ, సర్పంచి, వైద్యులు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని కల్లుబావి వీధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో అందుతున్న సేవలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బిపి, షుగర్, రక్తహీనత , దగ్గు, జ్వరం, తలనొప్పి, ఇతర దీర్ఘకాలిక రోగాలకు కచ్చితంగా పరీక్షలు నిర్వహించి, కావాల్సిన మందులు నెలనెల పంపిణీ చేస్తారని తెలిపారు. గడపగడపకు వెళ్లి ఎఎన్ఎంలు పరీక్షలు నిర్వహించి ఇప్పటికే రోగులను గుర్తించారని చెప్పారు. వారందరికీ కావాల్సిన పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మందులు ఇస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని చూసి ఓర్వలేక రాష్ట్రంలో రాజకీయ పార్టీలు విమర్శలు చేస్తున్నాయని తెలిపారు. ఆదోని అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. వార్డు నాయకులు గోవిందు, స్వామి దాసు, గణేష్, వైసిపి సీనియర్ నాయకులు నాగేంద్ర, రామాంజి, చంద్రకాంత్ రెడ్డి ఉన్నారు. **చిప్పగిరి** మండలం గుమ్మనూరు గ్రామంలో సర్పంచి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్, ప్రభుత్వ వైద్యాధికారి జమీల్ అహ్మద్ ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ హాజరయ్యారు. కర్నూలు నుంచి వచ్చిన స్పెషలిస్ట్ డాక్టర్లు సురబ్, మనోజ్, సుధా వాణి, మురళీమోహన్, జమీల్ అహ్మద్ 540 మంది పురుషులు, మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్స్ ప్రతి ఒక్కరినీ ఆకర్షించింది. గర్భిణులు, బాలింతలకు సూపర్‌వైజర్ ప్రసూన న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించారు. సర్పంచి పచ్చర్లపల్లి లక్ష్మీదేవి, ఖాజీపురం సర్పంచి రమాదేవి, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, వైసిపి నాయకులు శ్రీధర్, నారి, ఎపిఎం నాగార్జున, సిహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని కైరుప్పల గ్రామంలో 'జగన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి తిమ్మక్క మాట్లాడారు. ప్రతిఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను తీసుకొచ్చారని తెలిపారు. స్పెషలిస్టులు గీతావాణి, మంజుల, డాక్టర్ రఘురామ్ రెడ్డి, శశి కిరణ్, దుర్గాబాయి, అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, ఎంపిటిసి లక్ష్మీ, వైసిపి నాయకులు వీరభద్రి, రంగన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆస్పరిలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

బన్నీ ఉత్సవాలన్ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - హోళగుంద

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని అరికెర గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి, రింగ్ కర్రలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలసిన శ్రీమాల మల్లేశ్వరరావు బన్నీ ఉత్సవాలను (కర్రెల సమరాన్ని) ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకొని పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రతేడాది దసరా నాడు మాల మల్లేశ్వర కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు కర్రలతో పాల్గొనడం ప్రమాదకరమన్నారు. కాగడాలు, కర్రెలవల్ల చాలామంది భక్తులు గాయాల పాలైన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. అలా జరగకుండా ఉండాలంటే పోలీసులకు సహకరించాలని కోరారు. మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనడం వల్ల అనర్థాలు జరుగుతాయని తెలిపారు. ఒకరినొకరు కొట్టుకోకుండా ఉత్సవం ప్రశాంతంగా జరగడానికి సహకరించాలని కోరారు.

ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయండి

- వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున

సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున

ప్రజాశక్తి- దేవనకొండ

ఈనెల 19న ఎమ్మిగనూరులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభను జయప్రదం చేయాలని వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జడ్‌పిటిసి రామకృష్ణ కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు నాలుగోసారి 'జగనన్న చేదోడు' విడుదల చేస్తున్నారని, జగనన్న మాట ఇస్తే మాట తప్పరని అనడానికి ఇది ఒక నిదర్శనమని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీల కులగణనపై చర్యలు తీసుకోవడం హర్షణీయమని చెప్పారు. వైసిపి మండల సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జుబేర్ సాబ్, వైసిపి నాయకులు శంకరయ్య, హరిశ్చంద్ర, మద్దిలేటి, శీను, భీమన్న పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు చేయిస్తున్న సర్పంచి ఇస్మాయిల్

శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో ఉన్న శ్మశాన వాటికలో మంగళవారం బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి ఇస్మాయిల్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడేవారని, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి నేతలు ప్రదీప్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో బోరు వేయించినట్లు తెలిపారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా శ్మశాన వాటికలో తాగునీటి సమస్యపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్పందించి బోరు వేయించారని తెలిపారు. బోయ లక్ష్మణ, వైసిపి నాయకులు షేర్ ఖాన్, సర్పంచి తనయుడు ఆసిఫ్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు

ప్రజాశక్తి - ఆదోని

352 సర్వే నెంబరులో భూములపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించి, కబ్జాకు గురైన బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు కోరారు. మంగళవారం సిపిఐ బృందం భూములను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా సాదాపురం గ్రామ పంచాయతీలోని 352 సర్వే నెంబరు గల కొంత భూమి వివాదాస్పద వ్యక్తుల మధ్య తరచు వార్తల్లోనూ, సోషల్ మీడియా ద్వారా కబ్జాలకు గురఅవుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఒకే ప్లాటును ఇద్దరు, ముగ్గురికి రిజిస్ట్రేషన్ చేయించడం వల్ల నష్టపోయిన లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో మధ్యవర్తులను ఆశ్రయిస్తే న్యాయం చేయాల్సిందిపోయి సెటిల్‌మెంట్ చేయడం భావ్యం కాదన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై చర్యలు తీసుకొని ఈ భూ వివాదానికి కారణమైన 352 సర్వే నెంబరుపై విచారణ జరిపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మారెడ్డి, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి బి.ఎంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఒ.బి.నాగరాజు పాల్గొన్నారు.

భూకబ్జాలపై నిగ్గు తేల్చాలి

- మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

భూకబ్జాలపై నిగ్గు తేల్చాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎక్కడో ఒక చోట భూకబ్జా జరిగిందని స్పందనలోనూ, బహిరంగంగా ఆదోనిలో బాధితులు బయటకొచ్చి ఆత్మహత్యయత్నాలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై నిగ్గు తేల్చేందుకు మంత్రి మండలి ఉప సంఘంతో విచారణ చేపట్టాలని కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజుల నుంచి భూకబ్జాల వివాదం ఆదోనిలో ఎక్కువ అవుతోందని తెలిపారు. ఎవరైనా అన్యాయానికి గురై ఉంటే తన వద్దకొస్తే న్యాయం చేస్తానని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చెబుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేపైనా, వైసిపి నాయకులపైనా భూ కబ్జా ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నిజాయితీని నిరూపించుకోవడానికి ఒక మంత్రి మండలి ఉప సంఘం ఏర్పాటు చేయించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే మంత్రిమండలికి చట్టబద్ధత కలిగి ఉండాలని, భూకబ్జాలపై విచారణ కోసం కాలపరిమితి కూడా నిర్ణయించి విచారణ చేయించాలని తెలిపారు. ఈ విచారణ కూడా టిడిపి హయాం 2014 నుంచి వైసిపి ప్రభుత్వం 2023 వరకు పూర్తిస్థాయిలో చేయించాలని సూచించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి భూస్వామి అని, నిజాయితీపరుడని తనకు తెలుసని, అందరికీ తెలియాలంటే దీనిపై విచారణ అత్యంత అవసరమని తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే భూకబ్జా విషయంపై తనకు అన్నీ తెలుసని, అందువల్లే మాట్లాడడం లేదని చెప్పారని, తనకు ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారమే తెలియదని అన్నారు. తాను ఒక రైతునని, రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూకబ్జాలు తనకు తెలియని వారి వివాదంలో తనను లాగవద్దని స్పష్టం చేశారు. ఆదోని ప్రజలు ఈ భూకబ్జాల ఆరోపణలతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, ఇక్కడ భూములు కొనాలన్నా భయపడుతున్నారని తెలిపారు. ఒకరు ఒక బాధితునికి రూ.1.60 లక్షలు ఇస్తామంటే, మరొకరు రూ.3 లక్షలు ఇస్తామని ముందుకొస్తున్నారని చెప్పారు. ఈ భూకబ్జాల విషయంలో ఏం జరుగుతుందన్న విషయంపై సమగ్ర విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్రప్ప, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ఫక్రుద్దీన్, నాయకులు మల్లికార్జున, నారాయణపురం షేక్షావలీ, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తండ్రి, దేవుడెలా అవుతారు

ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు తండ్రి లాంటి వారని, దేవుడు లాంటివారని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందని మాజీ కౌన్సిలర్ రామచంద్ర విమర్శించారు. ఆయన ఎమ్మెల్యేను తనకు దేవుడు, తనకు తండ్రి అని చెప్పుకుంటే సరిపోతుందని, నియోజకవర్గ ప్రజలందరికీ చెబితే ఎలా అని ప్రశ్నించారు. తమ వ్యాపారాల కోసం ప్రజలందరినీ వాడుకోవడం తగదని సూచించారు. భూకబ్జా చేసిన వారిని పక్కన పెట్టుకుని ఎమ్మెల్యే ప్రెస్‌మీట్ నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. తాను అన్ని గుర్తుపెట్టుకుంటానని, సమయం వచ్చినప్పుడు చెబుతానని ఎమ్మెల్యే బెదిరించడం తగదన్నారు. స్పందనలో భూకబ్జా జరిగిందని ఫిర్యాదు చేసిన బాధితులను ముంబయికి పంపించారని తెలిపారు. భూకబ్జాల వల్ల ఆదోనిలో ఎలాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారమూ జరగడం లేదని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పని లేక వెలవెలబోతుందని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్ రెడ్డి

బైనదొడ్డి తిప్ప దగ్గర రిజర్వాయర్ నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కోడుమూరు

బైనదొడ్డి తిప్ప దగ్గర రిజర్వాయర్‌ను నిర్మించాలని, కోడుమూరు పట్టణానికి తాగునీ, సాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి డిమాండ్ చేశారు. గౌస్‌దేశాయి నాయకత్వంలో సిపిఎం ప్రతినిధి బృంధం పులకుర్తి ఎత్తిపోతల పథకాన్ని దాని పరిస్థితులను మంగళవారం పరిశీలించింది. తుంగభద్ర నది నుండి వస్తున్న పులకుర్తి ఎత్తిపోతల పథకం పైప్ లైన్ పనులను బృదం పరిశీలించింది. పులకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు బైనదొడ్డి దగ్గర రిజర్వాయర్ నిర్మిస్తే అక్కడ నీళ్లు నిలిపితే భూగర్భ జలాలు పెరిగి చుట్టూ ఉన్న ప్రాంత రైతులకు మేలు జరుగుతుందని, ఆ నీటిని రిజర్వాయర్ నుండి ఎల్ఎల్‌సి కాల్వకు మళ్లిస్తే వేల ఎకరాలకు సకాలంలో రైతులకు సాగునీరు అందించడానికి అవకాశం ఉందన్నారు. గతంలో పాలకులు పైపులైను మాత్రం తీసుకుని వచ్చి ఎల్ఎల్‌సి కాలువకు కలిపారని, రిజర్వాయర్ నిర్మించడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి బైనదొడ్డి తిప్ప దగ్గర రిజర్వాయర్ నిర్మించి కోడుమూరు పట్టణానికి శాశ్వత తాగునీటికి పరిష్కారం చూపించాలని ప్రతినిధి బందం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌తో పాటు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ, మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా, రైతు సంఘం మండల కార్యదర్శి మనోహర్, సిపిఎం మండల కమిటీ సభ్యులు టి.వీరన్న, సిఐటియు మండల కార్యదర్శి జిపి.వీరన్న, గూడూరు మండల కార్యదర్శి జై.మోహన్ పాల్గొన్నారు

లిఫ్టు ఇరిగేషన్ పనులను పరిశీలిస్తునన సిపిఎం బృందం

పాసుపుస్తకం ఎందుకివ్వరు..?

ప్రజాశక్తి - నందవరం :40 ఏళ్ల అనుభవంలో ఉన్న అడంగల్, ఆర్ఓఆర్‌లో హక్కుదారుని పేరు ఎందుకు ఎక్కించడం లేదంటూ నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సుమాల చార్లెస్ మాదిగ ప్రశ్నించారు. మంగళవారం తహశీల్దార్ నిత్యానంద రాజును కలిసి బాధితుల తరపున ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నందవరం మండలం పూలచింత గ్రామం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు-1లో పోతురాజు సుజ్ఞానమ్మ 0.73 ఎకరాలు సాగులో ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు ఉన్న అడంగల్, ఆన్‌లైన్‌లో ఎక్కించి పట్టాదారు పాసు పుస్తకం ఎందుకు ఇవ్వడం లేదని తహశీల్దార్‌ను ప్రశ్నించారు. తక్షణమే అసలైన హక్కు దారులకు ఆ సర్వే నెంబర్‌పై పట్టాదారు పాసు పుస్తకం కల్పించాలని కోరారు. లేకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. బాధితులు నగేష్, సుజ్ఞానమ్మ పాల్గొన్నారు

సస్యరక్షణ మెళకువలు పాటించాలి

- శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్

ప్రజాశక్తి - చిప్పగిరి

మిరప పంటలో అధిక దిగుబడులు పొందడానికి సస్యరక్షణ మెళకువలు పాటించాలని ఎమ్మిగనూరు కెవికె నుంచి వచ్చిన శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్ రైతులకు సూచించారు. మంగళవారం అగ్రికల్చర్ అసిస్టెంట్లు సుబ్బరాయుడు, వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏరూరు, డేగలహాల్ గ్రామాల్లో పత్తి పంటలో తీసుకోవాల్సిన మెళకువలపై రైతులకు డాక్టర్ రమేష్ నాయక్, ఆర్టికల్చర్ అధికారి ఇందిరా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాలు లేకపోవడంతో మిరప పంటలో చాలా అంటురోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. తగిన జాగ్రత్తలతో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మోతాదు మించకుండా నీళ్ల మందులను స్ప్రే చేయాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి కృత్రిమ ఎరువులను వాడడం రైతులు అలవాటు చేసుకోవాలని సూచించారు.

మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త రమేష్ నాయక్

నవధాన్యాలతో లక్ష్మమ్మ అవ్వ దర్శనం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోనిలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ నవధాన్యాల అలంకరణతో మంగళవారం దర్శనమిచ్చారు. శరన్నవ రాత్రోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు ఆలయ ధర్మకర్త రాయచోటి రామయ్య, రాయచోటి సుబ్బయ్య తెలిపారు.

'పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు దారుణం'

ప్రజాశక్తి - ఆదోని

పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణ దాడులు దారుణమని పిడిఎస్‌యు పట్టణ, అధ్యక్ష, కార్యదర్శులు శివ, అశోక్ కోరారు. పాలస్తీనా ప్రజలకు ఆహార పదార్థాలను, నిత్యావసర వస్తువులను అందకుండా చేస్తూ అమెరికా సామ్రాజ్యవాద అండతో దురాక్రమణ యుద్ధానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్ చర్యలకు వ్యతిరేకంగా మంగళవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్స్ రోడ్డు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమెరికా సామ్రాజ్యవాదం అర్బన్ దేశాల్లో ఇజ్రాయిల్‌ను తన స్థావరంగా ఉంచుకొని చమురు నిల్వలపై ఆధిపత్యం సాధించడం కోసం, యుద్ధాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. ఇజ్రాయిల్ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలందరూ నిరసన తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పాలస్తీనా భూభాగం నుంచి ఇజ్రాయిల్ వెంటనే వైదొలగాలని డిమాండ్ చేశారు. మహిళా సెల్ కన్వీనర్లు నిఖిత, కృష్ణవేణి, సాయి, అశోక్, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

నూతన రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

జీరో ప్రసవాలపై కలెక్టర్ అసహనం

- ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల లక్ష్యం సాధించాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని దీబగుంట్ల, టంగుటూరు పీహెచ్సీలలో జీరో డెలివరీలు చూపించడంపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వైద్య, విద్యాశాఖల ప్రగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో నెలవారీ కేటాయించిన లక్ష్యం మేరకు గర్భిణులు ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాలను తూచా తప్పకుండా సాధించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సెప్టెంబర్ మాసానికి సంబంధించి 255 డెలివరీల లక్ష్యం కాగా 136 మాత్రమే చేశారన్నారు. డోన్ ఏరియా ఆసుపత్రిలో ముగ్గురు గైనకాలజిస్టులు ఉన్నప్పటికీ డెలివరీ లక్ష్యాన్ని

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సాధించడంలో ఎందుకు విఫలమయ్యారని కలెక్టర్ ప్రశ్నించారు. అక్టోబర్ మాసానికి సంబంధించి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించాలని మెడికల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవమైన గర్భిణులను తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ద్వారా ఇంటికి చేర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత కోఆర్డినేటర్ అధికారికి సూచించారు. అర్హులైన ప్రతి రోగికి ఆరోగ్యశ్రీ కింద సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్ రెడ్డిని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు, చంటి పిల్లలకు ఐరన్ ఫోలిక్ టాబ్లెట్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

నాడు-నేడు పెండింగ్ పనులు, జిఇఆర్ సర్వే పూర్తి చేయండి

నాడు నేడు కింద పెండింగ్లో ఉన్న నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఎంఇఒ, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బడి బయట ఉన్న పిల్లలు (గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే)కు సంబంధించి నంద్యాల అర్బన్లో 121 మంది పిల్లలు, బనగానపల్లెలో 66 మంది, సంజామల, పాములపాడు మండలాలలో రెండు నెలల నుండి సర్వే పెండింగ్లో ఉందని, వెంటనే క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా, డీఈవో సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం

- మరో 2 నెలల్లో ఇంటింటికి తాగునీటి కొళాయిలు
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - ప్యాపిలి

డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం కొత్త రోడ్లు వేయించినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మరో 2 నెలల్లో ప్యాపిలి మండలంలో ప్రతి గ్రామంలో ఇంటింటికి తాగునీరు అందించనున్నట్లు స్పష్టం చేశారు. ప్యాపిలి మండలంలో రూ.5.5 కోట్లతో నిర్మించిన నూతన రహదారులను మంత్రి మంగళవారం ప్రారంభించారు. గార్లదిన్నె నుంచి అలేబాదు వరకు రూ.3 కోట్లతో 4 కి.మీ మేర కొత్త రోడ్డుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మునిమడుగు నుంచి అలేబాదు తండా వరకు రూ.2.5 కోట్లతో 5 కి.మీ మేర నూతన రహదారిని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాదయాత్ర చేస్తూ ముందుకు సాగారు. గార్లదిన్నె, మునిమడుగు, అలేబాదు, అలేబాదు తండా ప్రజలతో కలిసి పాదయాత్రగా వెళ్తూ ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగు నీటి సమస్య త్వరలోనే తొలగిపోతుందని మంత్రి భరోసా ఇచ్చారు. వర్షం వచ్చినా రాకున్నా ఇబ్బంది కలగని విధంగా డిసెంబర్కల్లా పైప్లైన్ ద్వారా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్యాపిలి మండలంలో ఇంటింటికి పుష్కలంగా తాగునీరు అందిస్తామన్నారు. అలేబాద్ గ్రామంలోని సింగిల్ విండో ఛైర్మన్ బాలయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బోరా మల్లికార్జున రెడ్డి, భువనేశ్వరరెడ్డి, మాజీ జెడ్పిటిసి దిలీప్ చక్రవర్తి, ప్యాపిలి సింగిల్ విండో ఛైర్మన్ బోరెడ్డి రాము, అలేబాద్ తండా గ్రామ సర్పంచి పరమేష్ నాయక్, ఎంపిటిసి, సింగిల్ విండో ఛైర్మన్ బాలయ్య, కో ఆపరేటివ్ సభ్యులు సీమ సుధాకర్ రెడ్డి, పోదొడ్డి కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్ శర్మ, ఎంపిడిఒ ఫజల్ రెహమాన్, నేరేడుచర్ల వెంకటేష్, బాలు నాయక్, వెంకటేష్ నాయక్, కొలిమి బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పగిడ్యాల

తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి, కరువు సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం పగిడ్యాలలో విలేకరుల సమావేశంలో నాగేశ్వరావు మాట్లాడుతూ మండలంలోని ముచ్చుమరి, బీరవోలు, ఆంజనేయ, పగిడ్యాల, లక్ష్మాపురం గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలిం చడం జరిగిందని, ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో కోరకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్ట ప్రాంతంలోని మొక్కజొన్న, మినుము, పత్తి తదితర పంటలు వర్షాలు లేక పూర్తిగా ఎండిపోయాయన్నారు. కెసి కెనాల్ ఆయకట్టు కింద సాగు చేసిన పంటలైన కాపాడుకుందామని రైతు ప్రయత్నిస్తే నీళ్లు వదలడంలో సంబంధిత అధికారులు ఘోరంగా విఫలం చెందారని మండిపడ్డారు. నాగటూరు ఎత్తిపోతల పథకం ద్వారా అయినా నీటిని విడుదల చేసి ఉంటే పంటలు కాపాడుకునే వాళ్ళమని రైతులు పేర్కొంటున్నారని వారు అన్నారు. కెసి కెనాల్కు, నాగటూర్ ఎత్తిపోతల పథకానికి నీళ్లు వదలకుండా రైతులను ఆదుకోకుండా ప్రభుత్వం విఫలం చెందిందని ఆయన విమర్శించారు. పగిడ్యాల మండలంతోపాటు నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాలను కరువు మండలాల ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు పంటల కోసం తీసుకున్న బ్యాంకు రుణాలను మాఫీ చేసి రబీ సీజన్ పంటలు సాగు చేసుకునేందుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ కూలీలకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు ఆరు నెలల పాటు రూ 2 వేల పెన్షన్ మంజూరు చేయాలని, ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా 15 రకాల నిత్యవసర సరుకులు అందించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని, లేని ఎడల సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, హుస్సేనామ్మ, సప్లయర్ వెంకటేశ్వర్లు, బాబు, బుజ్జన్న, ఉరుకుంద వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రైతులు రీ సర్వేకు సహకరించాలి : జెసి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

గ్రామాలలో రైతులు భూముల రీ సర్వేకు సహకరించాలని, నవంబర్ ఆఖరికల్లా రీ సర్వేను పూర్తి చేయాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కొలిమిగుండ్ల మండలంలోని ఇటిక్యాల, చింతలాయపల్లె గ్రామాలలో జరుగుతున్న భూ రీ సర్వేను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం చింతలాయపల్లె గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి ఉండగా వారి అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల పని తీరును, ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజల అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సర్వే అధికారులు పొలాల్లో సర్వే చేస్తున్నప్పుడు రైతుల సహకరించి చేయించుకోవాలన్నారు. కొందరు రైతులు గ్రామంలో లేని వారి విషయాన్ని జెసి దృష్టికి తీసుకెళ్లారు. వారికి ఒకరోజు ముందే సర్వే గురించి తెలిపి, పొలాలలో రైతులు ఉండే విధంగా చూడాలని అధికారులకు ఆదేశించారు. సర్వే ఉన్న సమయంలో రైతులు ఉంటే ఎక్కువ తక్కువ ఇబ్బంది లేకుండా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కావున ప్రతి ఒక్క రైతు సర్వే సమయంలో పొలాల వద్ద ఉండాలన్నారు. కొలిమిగుండ్ల మండలంలోని ఇటిక్యాల, చింతలయపల్లె, యస్ చెన్నంపల్లె, కోటపాడు, తుమ్మలపెంట, బెలూం, బెలూం సింగవరం, కలవటాల గ్రామాలలో రీ సర్వే జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు సరిత, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, విఆర్వోలు రవి, భార్గవి, పంచాయతీ కార్యదర్శులు భార్గవిలత, రాఘవరెడ్డి, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేని పరిశీలిస్తున్న జెసి

చంద్రఘంట అలంకారంలో అమ్మవారు

- రావణ వాహనంపై స్వామి అమ్మవార్లు - మల్లన్నను దర్శించుకున్నడిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

రావణ వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం చంద్రఘంట అలంకారంలో అమ్మవారు, రావణ వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో భాగంగా స్వామి అమ్మవార్లకు రావణ వాహనసేవ, అమ్మవారికి శ్రీచక్రార్చన, నవావర ణార్చన, విశేష కుంకు మార్చనలు, రుద్ర హోమం, చండీహోమం, చతుర్వేద పారాయణలు, రుద్ర పారాయణ, చండీపారాయణ, జపాను ష్ఠానాలు వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అలంకార మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని చంద్ర ఘంట అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావణ వాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చంద్రఘంట అలంకారంలో ఉన్న అమ్మవారిని, రావణ వాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి తీసుకువచ్చి రథశాల వద్ద నుండి నంది గుడి, బయలు వీరభద్ర స్వామి వరకు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో వివిధ రకాల నృత్య ప్రదర్శనలు, కోలాటం, చెక్కభజన, తప్పెట చిందు వంటి కళా నృత్య ప్రదర్శనలు, వేదమంత్రాలు మధ్య గ్రామోత్సవాన్ని చేపట్టారు.

కుమారి పూజ : దసరా మహోత్సవాల్లో సాంప్రదాయబద్ధంగా కుమారి పూజ నిర్వహించారు. ఇందులో 2 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల లోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రములు సమర్పించి ప్రత్యేక పూజలు వారికి నిర్వహించారు.

మల్లన్నను దర్శించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

శ్రీశేల క్షేత్రంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం రాత్రి ఆయన స్వామి అమ్మ వార్లకు పట్టు వస్త్రాలను సమర్పిం చారు. మంగళవారం ఉదయం స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని, అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణకు స్వాగతం పలుకుతున్న ఇఒ తదితరులు

ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచి, కార్యదర్శి తదితరులు

వ్యక్తి మృతి

- వైఎస్ఆర్ బీమా ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన తిరుమలేష్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. గ్రామ సర్పంచ్ డేగాని వెంకటేష్, కార్యదర్శి షాహినూర్లు వైఎస్ఆర్ బీమా పథకం కింద ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంత్యక్రియల నిమిత్తం తక్షణ సహాయం కింద రూ.10 వేలు మృతుడు భార్య సుమలతకు అందజేసినట్లు చెప్పారు. మిగిలిన రూ.90 వేలు సుమలత బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పార్థసారథి, వాలంటీర్ షేక్ షాహిన్ పాల్గొన్నారు.

19, 20న గొర్విమానుపల్లిలో 'గడప గడప'

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండలంలోని గొర్విమానుపల్లి గ్రామంలో ఈ నెల 19, 20న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గడప గడప కార్యక్రమానికి బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా గంగమ్మకు బోనాలు సమర్పణ

ప్రజాశక్తి - సంజామల : వర్షాలు కురవాలని కోరుతూ సంజామల మండల కేంద్రంలో మహిళలు గంగమ్మకు మంగళవారం బోనాలు సమర్పించి పూజలు చేశారు. వర్షాలు కురువకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వేసిన పంటలు ఎండిపోతున్నాయి మండలంలో 70 శాతం శనగ పంట వేస్తారు. ప్రస్తుతం శనగ పంటకు వర్షం లేకపోవడంతో పంట వేసిన మొలవదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షం కురవాలని కోరుతూ మహిళలు గంగమ్మకు బోనాలు సమర్పించారు.

బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నాణ్యమైన విద్యా బోధనకు కృషి

- జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో నాణ్యమైన విద్య ముఖ్యమైన అంశమని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖధికారి కె.సుధాకర్ రెడ్డి కోరారు. మంగళవారం నంద్యాలలో రాష్ట్ర విద్యా సాధన సర్వే-2023 జిల్లా స్థాయి ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఇఒ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సాధించిన అభ్యసన ఫలితాలు రాష్ట్ర విద్యాసాధన సర్వేలో ప్రస్ఫుటమవుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సర్వే ద్వారా విద్యారంగ పరిస్థితులను అంచనా వేసి తదనుగుణంగా విద్యా పథకాలను ప్రవేశపెడతారని పేర్కొన్నారు. ప్రభుత్వ అందిస్తున్న వివిధ పథకాల ప్రయోజనం నాణ్యమైన విద్య విద్యార్థులకు అందితేనే సఫలమవుతుందని చెప్పారు. 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన ఫలితాలను అంచనా వేయడానికి ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1119 పైచిలుకు పాఠశాలల్లో 10,113 మందికి పైగా విద్యార్థులను ఈ సర్వే ద్వారా పరీక్షిస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత, డిప్యూటీ డిఈఓ మహబూబ్ బేగ్ , ఎంఐఎస్ కోఆర్డినేటర్ మనోహర్ రెడ్డి, డీసీఈ బి సెక్రెటరీ, ఎఎస్ఓ కైజర్ మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ సుధాకర్ రెడ్డి

నిరసన దీక్షలను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

సిపిఎస్, జిపిఎస్లు వద్దని ఒపిఎస్ మాత్రమే అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 19 నుంచి తలపెట్టిన నిరసన దీక్షలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి ప్రసాద్, జయ సుధాకర్లు కోరారు. మంగళవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన జిపిఎస్ ఎటువంటి గ్యారెంటీ లేని పెన్షన్ విధానమని, పదేపదే ఉద్యోగ సంఘాలు కోరినా ప్రభుత్వం మొండిగా జిపిఎస్ను అమలు చేయడం విచారకరమన్నారు. ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానమే శ్రేయస్కరమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం 2004 సెప్టెంబర్కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన 11 వేల మందికి తక్షణమే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం ఈ నెల 9వ తేదీ నోటీసు అందజేసిందని, ఈ నేపథ్యంలో ఈ నెల 18న రాష్ట్రస్థాయిలో విజయవాడలో నిరసన దీక్షలు ప్రారంభిస్తున్నామని, 19న జిల్లాస్థాయిలో, 20న తాలూకా స్థాయిలో, 21న మండల స్థాయిలో దశలవారీగా నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 10వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు గత రెండు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. మంగళవారం ఈస్ట్ గోదావరి జిల్లా, కడప జిల్లా మధ్య జరిగిన పోటీలను అనంత విద్యాసంస్థల అధినేత అనంతరామ సుబ్బారెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా సాఫ్ట్ బాల్ కార్యదర్శి విజయ్, అధ్యక్షులు శశిభూషణ్, జాయింట్ కార్యదర్శి వెంకటేసులు మాట్లాడుతూ పోటీలు ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. విజేతలైన వారు వచ్చే నెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్లోని శ్రీనగర్లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

మోడీ విధానాలను వ్యతిరేకించాలి

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - నంద్యాల : బిజెపి ఆంధ్ర రాష్ట్ర ప్రజల పట్ల కుట్రపూరితమైన వైఖరి అవలంభిస్తుందని, మోడీ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నంద్యాలలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నాటక ఎన్నికల ముందు అప్పరభద్ర ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుగా ప్రకటించి ఐదు వేల మూడు కోట్లిచ్చి అసలే ఎడారిగా ఉండే రాయలసీమని శాశ్వత కరువు ప్రాంతంగా మార్చడానికి నిర్ణయించుకుందని అన్నారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో ఇచ్చిన తీర్పుని పున పరిశీలన చేసి ఇప్పుడున్న 811 టిఎంసిలలో 512 ఎపికి, 299 తెలంగాణకి అమలవుతున్న దాన్ని తెలంగాణ కట్టిన అక్రమ ప్రాజెక్టులను సక్రమ ప్రాజెక్టులుగా చేసి బిజెపి గెలవాలని ఇక్కడ మరో దురుద్దేశంగా కోస్తా జిల్లాలను కరువు జిల్లాలుగా ఈ కుట్రకు బలి అయ్యే దిశగా తెచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికీ కేంద్రానికి లేఖ రాస్తున్నానని అంటున్నారే తప్ప సమీక్ష పెట్టి, ఢిల్లీ వెళ్లి మోడీ, అమిత్ షా దగ్గర ఈ అంశం ప్రస్తావించే ధైర్యం లేక ఊరికే ఉండిపోయారని విమర్శించారు. రాష్ట్రాన్ని మోడీ, జగన్మోహన్ రెడ్డి కలిసి బోడి గుండు చేయించి ఎడారిగా చేసేందుకు సిద్ధపడ్డారని, దీనిని సిపిఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. రేపు కడపలో 12 జిల్లాలతో కూడిన రాష్ట్ర సదస్సుని ఈ ప్రాజెక్టుల మీద అన్ని పార్టీల నుంచి మీటింగ్ పెడుతున్నామని తెలిపారు. ఈ మీటింగ్కు రాయలసీమ, పల్నాడు, ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుండి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో విగ్రహ ప్రతిష్టకు రాజకీయ గ్రహణం

- గత 15 ఏళ్లుగా నాలుగు సార్లు వాయిదా

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలం చెర్లోపల్లె పునరావాస గ్రామంలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపన వివాదాస్పదంగా మారింది. చెర్లోపల్లె పునరావాస గ్రామం కావడంతో గుళ్లను నిర్మించి రెండు సంవత్సరాలు గడుస్తుంది. ఇంతవరకు విగ్రహ ప్రతిష్టను ఏర్పాటు చేయలేదు. గ్రామం రాజకీయ వివాదంలో నలుగుతోంది. గ్రామంలోని కొందరు ఈ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ట జరిపేందుకు ఈనెల 26న ముహూర్తం ఖరారు చేసి సన్నాహాలు సిద్ధం చేశారు. అయితే చెర్లోపల్లె గ్రామం పోలీసు రికార్డుల్లో అతి సమస్యాత్మక గ్రామంగా ఉంది. 30 సంవత్సరాల క్రితం ఈ గ్రామంలో ఫ్యాక్షన్ హత్యలు జరిగాయి. అప్పటి నుండి గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. 2009లో అప్పటి ప్రభుత్వం అవుకు రిజర్వాయర్ను నిర్మించింది. రిజర్వాయర్ నిర్మాణంలో గ్రామం నీటి ముంపునకు గురి కావడంతో ప్రభుత్వం పునరావాసంలో భాగంగా నూతన చెర్లోపల్లె గ్రామాన్ని నిర్మించింది. ప్రభుత్వం దేవాలయాల నిర్మాణం కోసం కొంత భూమిని కేటాయించి నిర్మించారు. ఫ్యాక్షన్ గ్రామం కావడంతో రెండు ప్రధాన వర్గాల మధ్య ఆదిపత్య పోరు కొనసాగుతూ వస్తుంది. ఆధిపత్య పోరు కాస్త దేవాలయాలపై కూడా పడింది. గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఆలయాలను నిర్మించారు. అయితే ఆలయాల్లో విగ్రహాలను ప్రతిష్ట చేసేందుకు 15 సంవత్సరాల నుండి రాజకీయ జోక్యంతో నాలుగుసార్లు వాయిదా పడింది. ఈ సారి ఎలాగైనా ప్రతిష్ట కార్యక్రమాన్ని కొనసాగించాలని ఓ వర్గం ఈ నెల 26, 27వ తేదీల్లో గ్రామ బొడ్రాయి, నాగప్రతిష్ట, పెద్దమ్మ, గంగమ్మ తల్లి, చెన్నకేశవ, శివాలయాల విగ్రహాల ప్రతిష్టను చేసేందుకు గ్రామస్తులు, పోలీసులు జోక్యం చేసుకొని నిర్ణయించారు. ఏర్పాట్లు కూడా చురుగ్గా చేస్తున్నారు. అయితే మరొక వర్గం తమ నాయకుల వద్ద ఎలాగైనా బొడ్రాయి ప్రతిష్టను నిలిపివేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు మాత్రం దీన్ని చాలెంజ్గా తీసుకొని ఈసారైనా ప్రతిష్ట కార్యక్రమాన్ని జరిపించాలని ప్రయత్నం చేస్తున్నారు. ప్రతిష్ట జరిగితే గ్రామంలో మళ్లీ ఫ్యాక్షన్ గొడవలు జరిగే అవకాశం ఉందని ఓవర్గం వారు పోలీసులకు బహిరంగంగానే చెప్పడం గమనార్హం. ఈ సారైనా ఫ్యాక్షన్ గ్రామంలో ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

వివాదాస్పదంగా మారిన దేవాలయాలు ఇవే

బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం బృందం

పట్టాలిచ్చిన పేదలకు స్థలాలు చూపించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలోని బిజినవేముల గ్రామ జగనన్న కాలనీలో పట్టాలిచ్చిన పేదలకు స్థలాలు చూపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, మండల నాయకులు పి పకీర్ సాహెబ్ టి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామం జగనన్న కాలనీలో సిపిఎం బృంద పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం బృందానికి లబ్ధిదారులు సమస్యలు వివరించారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం జగనన్న కాలనీలో పట్టాలిచ్చిన స్థలాలు చూపలేదని వాపోయారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం సర్వేనెంబర్ 410లో 150 పక్క గృహాలు మంజూరు చేశారని, పట్టాలు ఇచ్చిన పేదలకు 40 మందికి స్థలాలు చూపకపోవడం వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గ్రామానికి చెందిన ఆవుల శ్రీను స్థలంలో కబ్జాలో ఉన్న జగనన్న కాలనీకి ఇళ్లస్థలాలకు కేటాయించారని, ఆవుల శ్రీనుకు ప్రత్యామ భూమి చూపించి రెవెన్యూ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని లబ్ధిదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కారం చేయకపోతే ఆందోళన చేపడతారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సురేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్ల పరీక్షలను జెసి తనిఖీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రామకష్ణ డిగ్రీ కాలేజ్ మీటింగ్ హాల్లో ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లకు నిర్వహించిన పరీక్షలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య తనిఖీ చేశారు.

రీసర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -ప్యాపిలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న భూ రిసర్వే వేగంగా పూర్తి చేయాలని డోన్ రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్యాపిలి మండలంలోని మాధవరం గ్రామంలో తహశీల్దార్ చంద్రశేఖర వర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్‌ను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షలో భాగంగా భూముల రీ సర్వే పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. భూ రీసర్వే పనులు సకాలంలో పూర్తిచేసే విధంగా పనులు వేగవంతం చేయాలని రెవిన్యూ సిబ్బందికి, సర్వేర్లకు ఆర్డిఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు రంజిత,నాగరాజు, విఆర్ఓ బి టి రామానాయుడు రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటరెడ్డి

సమయ పాలనకు తూట్లు..

- ఇష్టారాజ్యంగా విధులకు సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - ప్యాపిలి

పరిపాలన ప్రజలకు చేరువ కావాలన్న ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అయితే క్షేత్రస్థాయిలో సచివాలయంలో ప్రజలకు సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంలో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ప్యాపిలి పట్టణంలోని కిందిగేరి 1, 4వ సచివాలయాలలో సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగుల అవగాహన రాహిత్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విమర్శలకు దారితీస్తుంది. ఉదయం 10.40 గంటలవుతున్నా సిబ్బంది కేవలం ఒక్కరు మాత్రమే హాజరు కాగా మిగతా కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మిగతా సిబ్బంది తహశీల్దార్ ఆఫీస్‌కి ఒకరు, మరొకరు ఎంపీడీవో కార్యాలయానికి, ఫీల్డ్ మీద బయటికి ఒకరు వెళ్లారని చెబుతున్నారు. రిజిస్టర్‌లోనూ సంతకాలు చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. నిర్లక్ష్యం వహిస్తున్న సచివాలయ సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కొబ్బరి పంట సాగును పరిశీలిస్తున్న దృశ్యం

ఉపాధి పథకంలో ఉద్యాన పంటల సాగు

ప్రజాశక్తి - చాగలమర్రి

జిల్లాలో 29 వేల హెక్టారులలో ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారని ఉపాధి హామీ పథకం అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి పట్టణం లోని ఉపాధి కార్యాలయన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు 29 వేల హెక్టారులలో ఉద్యాన పంటలైన కొబ్బరి,మామిడి,జామ,మునగ పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం ఉద్యాన పంటలకు సబ్సిడీ ఉంటుందని రైతులకు అవగాహన కల్పించి ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి పనులను, కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఉపాధి పనులను ఒకే చోట కల్పిస్తే పర్యవేక్షణ సులభతరమవుతుందని సూచించారు. ఉపాధి కూలీలకు పనిదినాలు 150 రోజులకు పెంచేందుకు,ఉపాధి సిబ్బంది వేతనాలు పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం చాగలమర్రి పట్టణంలో సాగు చేసిన కొబ్బరి,మల్లె పూల తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఏపిఓ నిర్మల,ఈసి,టెక్నికల్ అసిస్టెంట్ లు,ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

వైద్యం కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. నంద్యాల మండలం కానాల గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, గ్రామ సర్పంచి దూదేకుల బాపమ్మ, వైసిపి నాయకులు విజయశేఖర్రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ సుగుణశ్రీ, వైద్యులు, ఏఎన్ఎంలు, ఐసిడిఎస్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల మండలంలోని బి ఉప్పలూరు పంచాయతీ పరిధిలోని నాగిశెట్టి పల్లె (రామకృష్ణాపురం) ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచి ఈశ్వరయ్య, పేరం సత్యనారాయణరెడ్డి, హనుమంతగుండం సత్తిగారి రామిరెడ్డి, ఎర్రగుడి నాయకులు వై వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ కంబగిరి స్వామి, ఎంపీడీవో జీవి ప్రసాద్ రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని ఎంపిపి వీరభద్రుడు, సర్పంచు తులసమ్మ పేర్కొన్నారు. చాగలమర్రి పట్టణంలోని పరధిలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాస కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్ దౌలా,ఈఒఆర్‌డి సుదర్శన రావు తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మండల పరిధిలో బిజినవేముల గ్రామ సచివాలయం పరిధిలోని సర్పంచ్ రవి యాదవ్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఎంపిడిఒ శోభరాణి, ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి, పబ్బతి రవికుమార్, తాసిల్దార్ రాజశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** ప్రజలు ఆరోగ్యమే ధ్యేయంగా ఆరోగ్య సురక్ష అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసిపి సీనియర్ నాయకు లు బాబుల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎం పెండకల్లు గ్రామంలో సర్పంచ్ ఎం రామక్క, ఎంపీటీసీ మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష నిర్వహించారు. **పాములపాడు :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక, సర్పంచ్ లత అన్నారు. మండలంలోని వాడాల గ్రామంలో జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గొప్ప స్పందన వస్తోందన్నారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం కంటి అద్దాలను పంపిణీ చేసి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషకాహార ప్రదర్శనను అధికా రులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి రఘురాం పర్యేక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు వైద్య అధికారులు గులాబ్ షా,మౌనిక, టీబి సూపర్వైజర్ చెరుకు రవికుమార్, ఏపిఎం అనురాధ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజలీదేవి నాయకులు శిలా రెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

వృద్ధులకు కళ్లజోడు అందజేస్తున్న సర్పంచి, ఎంపిడిఒ, తహశీల్దార్

జూపాడుబంగ్లాను కరువు మండలంగా ప్రకటించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-నందికొట్కూరు టౌన్

జూపాడుబంగ్లాను కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జూపాడు బంగ్లాలో వేల్పుల ఏసన్న అధ్యక్షతన సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ. రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వర్షాభావంతో పంటలన్నీ దెబ్బతిన్నాయని అన్నారు. నష్టపోయిన పంటలకు పత్తి, మిర్చికి ఎకరాకు రూ. 50 వేలు, మొక్కజొన్న, కంది, కొర్ర తదితర పంటలకు ఎకరాకు రూ. 30,000 చొప్పున, రబీకి అన్ని రకాల విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని కోరారు. అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు రైతుల గురించి, రైతుల పంటల గురించి ఆలోచించడం లేదని అన్నారు. గడపగడప మొక్కుబడి కార్యక్రమంలో పాల్గొని సంబరపడడం కాకుండా పొలం బాట పట్టాలని రైతులకు జరుగుతున్నటువంటి నష్టాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకొని పోయి కరువు మండలంగా ప్రకటింపజేసి సహా యక చర్యలుచేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగన్న, వ్యకాసం కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, నరసింహులు, వేల్పుల దేవ భూషణం, సోమప్ప తదితర రైతులు పాల్గొన్నారు.

సన్మానం చేస్తున్న దృశ్యం

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కెవి సుబ్బారెడ్డి కళాశాల డైరెక్టర్లు భూమా శ్రీనివాసరెడ్డి, ఓబన్న, బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వనం ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం రాగి జావా తాగడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లింగమయ్య, శ్రీనివాసచారి, బషీర్ భాష, కాశీం సాహెబ్, రామతీర్థం, త్రినేత్ర మోహన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

21న స్పెషల్ లోక్ అదాలత్

ప్రజాశక్తి-నందికొట్కూరు టౌన్

ఈనెల 21న నిర్వహించే స్పెషల్ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల కేసులు పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణం నందు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నీటిపా రుదల భూములు లబ్ధిదారులకు రావలసిన డబ్బుల గురించి లోక్ ఆదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఆర్డీవో దాసు, శ్రీశైలం డిప్యూటీ కలెక్టర్, మిడుతూరు, పగిడ్యాల, నందికొట్కూర్, జూపాడు బంగ్లా తాసిల్దార్‌లు పాల్గొన్నారు.

జొన్న పొలంలోకి సాగునీరు

- 6 ఎకరాల్లో మొలకెత్తని విత్తనం
- రూ. 2 లక్షలు నష్టపోయిన కౌలు రైతు

ప్రజాశకి - బండి ఆత్మకూర్

మండలంలోని పరమటూరు గ్రామానికి చెందిన కౌలు రైతు కావేటి మధు పరమటూరు గ్రామానికి చెందిన రేగటి రంగస్వామి రెడ్డికి చెందిన ఆరు ఎకరాల బీడు పొలాన్ని కౌలు తీసుకొని రెండు రోజుల క్రితం జొన్న పంట సాగు చేశాడు. బీడు పొలాన్ని సాగు చేసుకునేందుకు, జొన్న విత్తనం వేసేందుకు పెట్టుబడి దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాడు. అయితే పక్కనున్న పొలం కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న గందివేముల శ్రీనివాసులు అతని పొలానికి సాగు నీరు పెట్టుకుంటూ పక్కనున్న ఆరు ఎకరాల భూమిలోకి నీళ్ల వదిలాడు. దీంతో కావేటి మధు వేసిన జొన్న విత్తనం మొలకెత్తకుండా తీవ్ర నష్టం వాటిల్లింది. తన పొలానికి నీళ్ల ఎలా పెట్టావని శ్రీనివాసులును అడగగా తనకు ఏమీ తెలియదని, నీ ఇష్టం వచ్చినట్లు చేసుకుపో అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని బాధిత కౌలు రైతు కావేటి మధు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. పేద రైతునైన తాను కౌలు తీసుకున్న పొలానికి ముందుగానే కౌలు చెల్లించానని, ప్రస్తుతం జొన్న విత్తనం మొలకెత్తక పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, తనకు పోలీస్ ఉన్నతాధికారులు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నాడు.

విత్తనం వేసిన జొన్న చేనికి నీళ్లు పెట్టిన దృశ్యం


జొన్నవిత్తనం మొలకెత్తకుండా పోయిన దృశ్యం

మానవత్వం చాటుకున్న కౌన్సిలర్

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఎల్లప్పుడూ వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపదలోని వారిని ఆదుకునే నాయకుడిగా పేరొందిన కౌన్సిలర్ అల్లూరి కృష్ణ మానవత్వం చాటుకున్నారు. నందికొట్కూరు పట్టణంలోని మూడో వార్డులో అనారోగ్యం మృతిచెందిన అనసూయమ్మ (75) కుటుంబానికి కౌన్సిలర్ అల్లూరి కృష్ణ ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం అనసూయమ్మ మరణ వార్త తెలిసిన వెంటనే అల్లూరి కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి, అంతక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు కౌన్సిలర్‌కు ధన్యవా దములు తెలియజేశారు. కార్యక్రమంలో వాలంటరీ గోకారి పాల్గొన్నారు.

'బంజారా సంస్కృతిని కాపాడుకోవాలి'

ప్రజాశక్తి - ఆత్మకూరు

బంజారా జాతి ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి, జాతి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామ్ బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం నాడు ఆత్మకూరు మండలంలోని, కొట్టాలచెరువు గ్రామంలో జరిగిన బంజారా జాతి సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారా జాతి ప్రజలు ఐక్యమత్యంగా ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

గౌరవాధ్యక్షులుగా యస్.రాజేశ్వర నాయక్, గౌరవ సలహాదారులుగా యం.బాలు నాయక్, ఎన్.వెంకటశివ నాయక్, ఉపాధ్యక్షులుగా ఎన్. శంకర్ నాయక్, ట్రెజరర్‌గా జె.తులసి నాయక్, ప్రధాన కార్యదర్శిగా యం.వాలు నాయక్, అదనపు కార్యదర్శిగా ఎన్.రాజునాయక్, కార్యవర్గ సభ్యులుగా ఐదు మందిని, మహిళా ప్రతినిధులుగా మరో ఐదు మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జవహర్ నాయక్ అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కోట కందుకూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి , మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు కొలిమి హుస్సేన్ బాషా, రామకష్ణ, శేఖర్, రాజగోపాల్ రెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ నర్స్ ఆత్మహత్య

ప్రజాశక్తి బనగానపల్లె రూరల్

బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న హెడ్ నర్స్ వీర పోగు శరత్ కుమారి (33) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్టు బనగానపల్లె ఎస్సై వీరాంజనేయులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వి. శరత్ కుమారి (33) కర్నూలు జిల్లా గూడూరు మండలం నాగలాపురం గ్రామానికి చెందిన వి మద్దిలేటి కుమార్తె వి.శరత్ కుమారి(33) బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి రెండు సంవత్సరాలుగా నుండి విధులు నిర్వహిస్తోంది. సోమవారం రాత్రి 8 గంటలకు విధులు నిర్వర్తించి ఇంటికి వెళ్లింది. మంగళవారం సాయంత్రము 5 గంటలకు విధులకు హాజరు కావలసి ఉండగా హాజరుక పోవడంతో సిబ్బంది శరత్ కుమారి ఇంటికి పోయి పిలు వగా పలకలేదు, చుట్టుపక్క వారిని పిలిచి తలుపులు తెరిచి లోపల చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వీరాంజనేయులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం : ఇఒ

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో దాతల సహకారంతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ వారి ఆర్థిక సహాయ సహకారాలతో రూ. 30 లక్షలతో మరుగుదొడ్ల, స్నానపు గదులు నిర్మాణం చేపట్టను న్నట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు. వీటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వీటిని నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇవి పూర్తయిన వెంటనే రెండో విడతలో భాగంగా మరో రూ. 10 లక్షలు అదనపు నిర్మాణాల కోసం జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ యాజమాన్యం ఆర్థిక సహాయం చేయనున్నట్లు తెలిపారు.

ఆలయాల అభివృద్ధిపై మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - బేతంచెర్ల

డోన్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి పనులపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బేతంచెర్లలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రూ.6 కోట్లకు పైగా నిధులతో జరుగుతున్న ఆలయాల పనుల పురోగతిపై దేవాదాయ శాఖ జిల్లా డిప్యూటి కమిషనర్ గురుప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్యాపిలి మండలంలో రూ.1.74 కోట్లతో కంబగిరి స్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.1.90 కోట్లతో డోన్ మండలంలో జరుగుతున్న గుండాల చెన్నకేశవస్వామి క్షేత్రానికి సంబంధించిన పనుల పురోగతిని మంత్రికి వివరించారు. రూ.1.50 కోట్లతో సాగుతున్న బేతంచెర్ల ఆంజనేయ స్వామి గుడి నిర్మాణ పనులను గురించి వివరించారు. ఏయే దశల్లో పనులు సాగుతున్నాయో ఫోటోల ద్వారా మంత్రి బుగ్గనకు వెల్లడించారు. డిసెంబర్ కల్లా అన్ని పనులు పూర్తి చేయాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కు దేవాదాయ శాఖ డిప్యూటి కమిషనర్ గురు ప్రసాద్ కాసాపురం ఆంజనేయస్వామి ఆలయ ప్రసాదం అందజేశారు. అనంతరం పట్టు వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటి కమిషనర్ గురుప్రసాద్, మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ ఈవో పాండురంగా రెడ్డి, డిప్యూటి ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు టిడ్కో గృహాల ప్రారంభోత్సవం

- లబ్ధిదారులు హాజరు కావాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ ప్రజలు ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న సొంతింటి కల బుధవారం సాకారం కానుంది. మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంట సమీపంలో టిడ్కో వారు నిర్మించిన జగనన్న కాలనీ ఈనెల 18వ తేదీన ప్రారంభోత్సవం చేస్తున్నట్లు కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చింతకుంట వద్ద టిడ్కో వారు అన్ని వసతులతో, మౌలిక సదుపాయాలతో 1392 గృహాలను నిర్మించారన్నారు. టిడ్కో గృహాలను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఫైనాన్స్ మినిస్టర్ బుగ్గన రాజేంద్రనాథ్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డిల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి పర్యవేక్షణలో ఆగిపోయిన టిడ్కో గృహాలను తిరిగి కట్టడానికి ఎంతో కృషి చేశారన్నారు. టిడ్కో గృహాల సముదాయం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా నీటి వసతి, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేశామ న్నారు. కావున బుధవారం మధ్యాహ్నం లబ్ధిదారులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సకాలంలో హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఏఈ సురేంద్రరెడ్డి, టిడ్కో ఏ.ఈ రామసుబ్బయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

పరమేశ్వరి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కొండపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ గాయత్రి దేవి అలంకారంలో ఉన్న వాసవి మాతకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీసీ జనార్ధన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు గాదంశెట్టి వేణుగోపాల్, శాశ్వత గౌరవ అధ్యక్షులు పిఎస్ఎస్ నారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీరామ సుబ్రహ్మ ణ్యం, ట్రెజరర్ సముద్రాల చక్రపాణి గౌరవ సలహాదారులు గాదంశెట్టి రవికుమార్, ఉపాధ్యక్షులు నల్లగట్ల శివయ్య, కార్యదర్శి గూండా రవికుమార్, కాసుల జంగం శెట్టి, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు

లక్ష్యాన్ని సాధించడానికి కష్టపడి చదవాలి

- ఇంటర్మీడియట్ విద్యాధికారిణి బి. సునీత

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండ లంలోని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా లను నంద్యాల జిల్లా ఇంటర్మీ డియట్ విద్యాధికారిణి శ్రీమతి బి. సునీత మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను, స్టడీ అవర్స్‌ను ఇంటర్మీడియట్ విద్యాధికారిణి బి. సునీత ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాధికారిణి బి.సునీత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని కలిగి ఉండాలని,ఆ లక్ష్యాన్ని సాధిం చడానికి తగిన విధంగా కష్టపడి చదవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అలాగే టీచింగ్ స్టాఫ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాలకు పరీక్షా ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం వచ్చేందుకు ప్రయత్నించాలని, విద్యార్థులకు చక్కటి బోధనను అందించాలని డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి. శ్రీనివాసులు, సీనియర్ లెక్చరర్ పి.శ్రీనివాసరెడ్డి, తెలుగు లెక్చరర్ ఎస్.బాల ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి

కాంపౌండ్ వాల్ ప్రారంభం

ప్రజాశక్తి - గడివేముల

మండల కేంద్రమైన గడివేముల మూల పెద్దమ్మ ఆలయ కాంపౌడ్ వాల్‌ను మంగళవారం ప్రారంభించారు. నంద్యాల పట్టణానికి చెందిన పశుసంవర్ధక శాఖ అధికారి ఎన్ శ్రీనివాసులు శ్రీనివాస్, ఎన్ వెంకటేశ్వర్లు, ఎం శ్రీనివాసులు, ఎన్ లక్ష్మయ్యా వారి తల్లిదండ్రుల కీర్తిశేషులు ఎరుకల తిక్క భూషన్న, సుబ్బమ్మల జ్ఞాపకార్థం రూ.రెండు లక్షల 50 వేలతో నిర్మించిన కాంపౌండ్ గోడను, గేటును ఆలయ చైర్మన్ చిన్నన్న, ఆలయ అధికారి మోహన్ ఆధ్వర్యంలో జెడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి చేతుల ప్రారంభించారు. ధర్మకర్తలు, కేశవులు, ఉప సర్పంచ్ బాలచేన్ని, గ్రామ పెద్దలు కేశవయ్య, శేషాద్రి గౌడ్,వాల్మీకి నాయకులు మాచర్ల ఆలయ సిబ్బంది, వైసిపి నాయకులు బొల్లవరం భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్ గోడను గేటును ప్రారంభిస్తున్న దృశ్యం

టిడిపి నాయకులు పాదయాత్ర

ప్రజాశక్తి నందికొట్కూరు

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా నంద్యాల పార్లమెంటు ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇంచార్జ్ గౌరు వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా టిడిపి నాయకులతో కర్నూల్‌లోని ఎస్టీ బీసీ కాలేజ్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు నిర్వహించిన శాంతియుత ర్యాలీలో నిమ్మకాయల మోహన్, బొలెద్దుల రాజన్న, విజయుడు, సురేష్, వంశీ, తదిత టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీలో పాల్గొన్న టిడిపి నాయకులు